# హృదయశల్యము

ఆర్.
రంగనాథశాస్త్రి

ఆతని వయసు ఇరువదియైదు సంవత్సరములకు లోపు, రూపలావణ్యవిలాసము లద్వితీయములు. సుందరరావు అను నామధేయ మాతనియెడల సార్థకత చెందినది. ఎం. ఏ. పరీక్షయందు త్తీర్ణుడాయెను. పెదతల్లి గారింట వారము దినములుండి, బెంగుళూరునకుబోయి వేసవి నిగడుప దలచెను. కాని పరిస్థితుల ననుసరించి పెద తల్లిగారింటనే నెలదినము లుండవలసినవా డాయెను. ఈతని పెదతల్లికి యొక్కడే పుత్రుడు. పేరు వెంకటరావు. వీరిర్వురు గుంటూరునందు మేనమామ యింటియందుండి ఇంటరువరకు చదువుకొనిరి.

అన్నవస్త్రములకు లోటులేని స్థితిపరుడు వీరి మేన మామ. ఆయనకు నల్వురుపుత్రికలు. పుత్రసంతానము లేదు. ధార్మికగృహస్థుడు సచ్చింతనమున కాలముగడుపు చుండును.

ఆయన పెద్దకొమరితె పేరు విద్యాసుందరి. ఈమెకు సంస్కృతాంధ్రములయం దుత్పత్తి జ్ఞానముకలదు. కొలదిగ ఇంగ్లీషు నభ్యసించెను. సంగీతము స్వతస్సిద్ధము; శరీరము మృదుమధురము. శ్రుతిలయలు తప్పియెరుంగదు. వినయ సౌశీల్య సౌజన్యము లా బాలికకు సహజాలంకార ములు.

ఆ దంపతులు విద్యాసుందరికి తగినభర్త సుందరరావని యువ్విళ్లూరుచుండిరి. ఇరుగుపొరుగు వారాభావమునే కలిగియుండిరి, కాని, వారి సంకల్పముసిద్ధింపలేదు. చదువు పూర్తియైనగాని వివాహము తలపెట్టనని సుందరరావు మద్రాసున కరిగెను.

విద్యాసుందరి తన హృదయమును వెంకటరావున కర్పించినది. ఆతనురూపికాడు; అట్లనికురూపియు గాదు. మిక్కిలి మితభాషి. సంగీతమందు మిక్కిలి దిట్ట. ఎట్టి పల్లవినైనను గంగాప్రవాహ సదృశమగు స్వరలహరితోడ బాడుచు శ్రోతల మంత్రముగ్ధులుగ నొనర్చుచుండెను.

ప్రేమ గ్రుడ్డిదికదా, ప్రేమికుల పరస్పరదృక్కులకు గోచరింపుచుండు రూపలావణ్య లీలావిలాసముల నల రారు దివ్యమూర్తులు. పరుల కగోచరములు. నిర్వచిం చుట కనిర్వాచ్యములు.

విద్యాసుందరి వెంకటరావును గాఢముగ ప్రేమించిన దను విషయమును ఆమెతల్లిగూడ గమనింపజాలకుండెను. విశుద్ధప్రేమకు బాహ్యచిహ్నములు, ఆడంబరరహితములు. అందువలన వారు, సుందరరావునే మనమునందుంచు కొనిరి. రామయ్య యాతనికి యుత్తరమువ్రాసెను. కాని యం. ఎం. పూర్తియైనకాని వివాహమాడనని స్పష్టముగ సుందరరావు ప్రత్యుత్తర మిచ్చెను.

ఇక గత్యంతరమేమి?

రామయ్య కొన్నిదినములు మౌనముగనుండెను. ఒక దినమున సుందరరావువ్రాసిన యుత్తరమును విద్యాసుం దరికిచ్చెను. విద్యాసుందరి దానిని చదువుకొని తిరిగితండ్రి కిచ్చెను. తలిదండ్రులు వివాహవిషయమున విద్యాసుంద రిని ప్రశ్నించిరి. కాని యేవిధమగు ప్రత్యుత్తరమును లేకుండెను. మరియు విద్యాసుందరి ముఖాకవళికయం దేమి, మాటలయందేమి, ఆటపాటలయందేమి, అణు మాత్రమైనను మార్పుగోచరింపదాయె. తదనంతరము రామయ్య విద్యాసుందరిని వెంకటరావునకిచ్చి మహా వైభవముగ వివాహ మొనర్చెను.

'వివాహో విద్యనాశాయ' అను వచనానుసారము వేంకట్రావు వివాహమైన నెలదినములలో నేతిరిగి బాదరు నోబులుకాలేజియందు చదువుకొనుటకు బోక, స్వగ్రామ మునకరిగి యట నివసింపజొచ్చెను.

⁂ ⁂ ⁂

వెంకటరావు దివ్యరత్నము చేజిక్కునా లేదా యని రెండువత్సరములు మిక్కిలి తహతహలాడెననుట యతిశ యోక్తికాదు. మరియు సుందరరావును పరమశత్రువుగ భావింపుచుండెను. విద్యాసుందరి సుందరరావుతోడ మాట్లాడుటయే, యాతనికి కంటకము కాజొచ్చెను. ఎట్టెటో ఇంటరు ప్యాసయ్యెను. కాని యాతనికి చదువు

మీద ధ్యానమే లేకుండెను. విద్యాసుందరికి కథలో, కబుర్లో, సంగీతమో చెప్పుచు, ఆ బాలికమనమును చూరగొనుటయే యాతని నిత్యకృత్యమై యుండెను. ఈతడు మిక్కిలి కపటి. పిరికివాడు. ఏ విషయమును ధారాళముగ బ్రకటింపశక్తిగలవాడు కాడు. మరియు విద్యాసుందరి తనకే హృదయ మర్పించినదని గ్రహింపజాలకుండెను. అనుమాన గ్రహస్థునకు ప్రతివిషయమం దనుమానమే గదా! శంకాసంశయములేగదా! అవి వృద్ధియైన కొలదిని జగత్తంతయు తనను అడ్డగింపుచున్నదనియు, స్వీయ శక్తి సామర్థ్యములను నితరులు పరిగణించుట లేదనియు; మానవులందరు కపటులు – అసూయాపరులు - దుర్మార్గులనియు, తానుమాత్రమే పవిత్రహృదయుడనని తలంచుట సహజము. అందువలన నీతడు విద్యాసుందరిని చేజిక్కించుకొనవలయునను తీవ్ర ప్రయత్నమున సుందరరావును ద్వేషింపజొచ్చెను. అసహ్యించుకొనుచుండెను. "తెలివితక్కువవాడు, బుద్ధిహీనుడు, దరిద్రు"డని మనమునం దనుకొనుచు స్వీయ ప్రతిభావిశేషముల నుగ్గడించుకొనుచుండెను. కాని ఈతని మనోభావ మెవ్వరికిని తెలియదు. అత్యంతకపటియగు నీతని మితభాషిత్వమును గాంచి యెల్లరును మంచివా డనుకొనుచుండిరి.

సుందరరావు నిష్కపటి; నిష్కల్మష హృదయుడు; నిరంతరము సంఘముసేవ జేయవలయునను సంకల్పము గలవాడు. అవకాశము దొరికినపుడెల్ల ఉత్తమగ్రంథముల చదువుచు, అందలి విషయములను పలువురతోడ జర్చింపుచుండును. సహాధ్యాయులలోపములను సవరించుటకు బ్రయత్నించి యపుడప్పుడు వారి యాగ్రహమునకు గురియగుచుండెను. కాని వారి మిత్రత్వమును వీడి యెరుంగడు. కాలేజియందును, పునర్జన సభలయందును, నిర్భయముగ హృదయస్పర్శి యగుభాషలో నుపన్యసింపుచుండెను. నుడివినటుల నడచుటకు బ్రయత్నింపుచుండెను. అతని నీతివర్తనము-సత్కార్యానురక్తి-నిర్భయముగ సత్యమునువచించు శక్తి- మొదలగు సద్గుణముల వలన గుంటూరుపురవరమందలి సామాన్యజనులతోగూడ సుందరరావు నెరుంగనివారులేరు. అతని కీర్తిప్రతిష్ఠలు మొదలగునవి వేంకట్రావునకు కర్ణకఠోరముగ నుండెను.

వెంకట్రావు కాలేజికి యొంటరిగబోయి తిరిగి యొంటరిగ గృహమును జేరుచుండెను. సుందరరావుతో కలిసి పోవుట మానుకొనెను.

సుందరరావు, ఈర్ష్య-ద్వేషములతోడ సంబంధము కలవాడుగాడు. అందువలన వేంకట్రావు మనోభావమును గ్రహింపవలయునను తలంపే యాతనికి కలుగకుండెను. విద్యాసుందరి సుందరరావుకడ గూర్చిండి కబుర్లు చెప్పునప్పుడు ఆమె తలిదండ్రు లాజంటనుగాంచి పరమానందభరితులగుచుండిరి.

మానవసంకల్పము భగవత్సంకల్పమున లీనమగుట మిక్కిలి యరుదు. విద్యాసుందరి తలిదండ్రుల సంకల్పమీడేరలేదు. కాని వారికి వెంకట్రావునం దేవిధమగు లోపములును గన్పడకుండెను. విద్యాసుందరికి వెంకటరావుకంటె, సుందరరావు భర్తయైనచో ఆ జంట సర్వవిధముల బాగుండెడిదని వారి నమ్మకము.

∴ ∴ ∴

హిందూధర్మమందు వివాహము తాత్కాలిక సంబంధము కాదు. అది జీవితబంధనము. అనేక జన్మలనుండి యా జంట పరస్పరము కలసిమెలసి పరిణామమును బొందుచు, నేడీ స్థితికివచ్చినదనియు, ఇంకను నీజంటయెన్నియో జన్మలెత్తి చివరకు పరిపూర్ణతనుగాంచి యేకత్వమును బొందునని పండితమండలి విశ్వాసము.

వెంకటరావు స్వగృహమునుజేరి వ్యవసాయమును వృద్ధిచేసుకొనుచుండెను. ఇంగ్లీషు చదువుకొని మితభాషిత్వమున, వినయముగ బ్రవర్తింపుచుండుటవలన నీతనియెడ స్వగ్రామవాసులకు మిక్కిలి యనురాగ మేర్పడెను; ఈత డెల్లరకును ప్రీతిభాజనుడై మెలంగజొచ్చెను. కాని యీతని హృదయమందలి యాందోళన సుందరరావును వీడి యత్తమామలమీదికిని, వారినుండి విద్యాసుందరి మీదకు బ్రవహింపుచు అనేకరూపములు దాల్చుచుండెను. ఆ కల్పితరూపముల ననేకవిధముల వృద్ధిపొందించుకొని, పలువిధముల నలంకరించి, చివర కత్తను శూర్పణఖగను మామను మారీచునిగను తలంపజొచ్చెను. మరియు, నీతడెప్పుడును నీ క్రిందివిధముగ చర్చించుకొనుచు కటకటపడుచుండువాడు. "నాకంటె, సుందరరావు, చక్కనివాడా? తెలివిగలవాడా! శుద్ధవదురుబోతు. ఆత్మ ప్రశంసకు దేశాభిమానమనుచుండును. సంఘమును మరమ్మతు చేయవలయునని నిరంతరము వాగుచుండును. సభలయందు స్త్రీలుగనుపడిరా స్త్రీస్వాతంత్రమని వెర్రిమొర్రి యరపులు అరచును. ఇదియంతయు శుద్ధవదురుగాక మరేమి? నేనుమాత్రము వదరదలచిన వదురలేనా, కాని నా కాత్మప్రశంసగిట్టదు. అందువలన నేజోక్యమునకు బోను. నిజమునకు వారు నాకంటె కొంచెము ఇంగ్లీషు నందధికులు. అంతే, సంగీతమురాదు. తెలుగంతకంటెను రాదు, సంస్కృతాక్షరములే తెలియవు. ఇంతకు చేరెడు మడిమాన్యమైనను లేని శుష్కదరిద్రుడు. అట్టివాడికింత మర్యాదా! కీర్తి ప్రతిష్ఠలా! లోకులకు బుద్ధిలేదు, నిజము ముమ్మాటికి నిజము. నేనో, సంగీత సాహిత్యములయందసమానుడను; సంస్కృతమం దుత్పత్తిజ్ఞానము కలిగినద్ది

కదా! ఇంక నాకు లోటేమి! నేను ధనికుడను. పదిమందికి బెట్టగలను. తినగలను. ఇంగ్లీషులోకూడ లెక్చర్లీయగలను. కానివాని శరీరచ్ఛాయపసుపు, నా శరీరచ్ఛాయ ఎరుపు. మా కిద్దరకును కొంచెము భేదమిచ్చటనే. పసుపువన్నె యన్నట్లు బెట్టునా! ఎరుపువన్నెయన్నము బెట్టకుండునా! కాని యందు బుద్ధిహీనులలో అత్తయ్య మొదటిది. రెండవవారు రామయ్య మామయ్య, కాకుంటే, ఆ దరిద్రుడికి పిల్లనియ్యవలెనని పాటలు పాడెదరా! నన్నవమాన పరచెదరా! సుందరిచదువు నా దగ్గర; ఆసామాషీలు వాడి దగ్గర సంగీతవిద్యాభ్యాసము నా దగ్గర; హాయిగా పాడి వినిపించుట వాడిదగ్గర, వినయవిధేయతలు నాదగ్గర, సరససల్లాపాలు వాడిదగ్గర......ఛీ,ఛీ, ఇంతకు వారందరకు; నేను విద్యాసుందరికి తగినభర్తనుగాననియే స్థిర నమ్మకము. కాని చివరకు వారిపప్పు వుడికిందికాదు. వాడు శుద్ధ పైత్యకారి. చేతిలోచిక్కిన దివ్యరత్నమును జారవిడుచుకున్నాడు. అప్పుడు - విధిలేక - సంబంధము దొరుకక-ఆలసించిన కులముపోవునని, సుందరిని నాకిచ్చి వివాహ మొనర్చిరి. అంతేకాని, వారికి నా మీద గౌరవములేదు. మర్యాదలేదు. ఆ రత్నమితరుల చేజిక్కునని నేను పరితపించినమాట వాస్తవము. కాని యిప్పుడేమి భయము? ఎక్కడకుబోవును? ఇంతేకాదు. సుందరిగొంతు నాగొంతుకంటె మంచిదట. నాకంటె చక్కనిదట..."

ఈ విధముగు విచారణతోడ ఆతడు, కుమిలిబోవుచుండెను. ఈర్ష్యాక్రోధములు - అసూయ- అసహనములు - నాతని జుట్టుకొని పరితపింప జేయుచుండెను.

∴ ∴ ∴

విద్యాసుందరి కాపురమునకువచ్చెను. ఆమె రూపురేఖావిలాసములు-వానికి వన్నెదెచ్చు వినయవిధేయతల నలరారు సౌశీల్యము, సంగీతసాహిత్యముల కా గ్రామవాసులు పరమానందభరితులగుచుండిరి.

విద్యాసుందరి సాయంతన గృహకృత్యముల నిర్వర్తించుకొని తులసికోట సమ్ముఖమున గూర్చుండి వీణను వాయించుచు, త్యాగరాజకృతులను బాడుటకు గడంగినంతనే, యా గ్రామములోని స్త్రీపురుషాదులు గుంపులు గుంపులుగావచ్చి యటజేరుచుండిరి. పరమానందభరితులై విద్యాసుందరిని పలువిధముల బ్రశంసింపుచు గృహోన్ముఖులగుచుండిరి. మధ్యాహ్న భోజనానంతరము భాగవతమును చదివి యర్థము చెప్పునప్పుడు వృద్ధాంగనలే కాక పండితులుగూడ దీవించిబోవుచుండిరి.

ఒక్క నెలదినములలో వీరిల్లు దేముడిగుడి యాయెను. విద్యాసుందరికి పురాణపఠనసమయమున భర్తయుండవలయునను నియమములేదు. కాని సంగీతముమాత్రము భర్త యెదుటగూర్చుండి తాళము వేయుచున్నప్పుడు మాత్రమే బాడుచుండెను; వీణను వాయించుచుండెను.

వెంకట్రావుగూడ యప్పుడప్పుడు బాడి స్వీయప్రతిభను వెల్లడింపజొచ్చెను. కాని యెల్లరును విద్యాసుందరినే ప్రశంసింపుచుండిరి. ఆ విషయ మాతనిని వేధింపసాగెను.

ఇట్లు మూడునాలుగు మాసములు గడచునప్పటికి చుట్టుప్రక్కల గ్రామవాసులుగూడ, అప్పుడప్పుడువచ్చి విద్యాసుందరి సంగీతసాహిత్యముల కచ్చెరువొందుచు సంతసముగ తిరిగి స్వగ్రామముల కరుగునప్పుడు "వెంకట్రావు సంగీత విద్వాంసుడు. బాగుగ పాడుననుకొనుచున్నాము, కాని పెండ్లాముపాట ముందర వాడిపాట దిగదుడుపురా? అహా! ఆపిల్ల దెంతటి మనోహరకంఠము అనుకొను మాటలు వేంకటరావుచెవుల బడుచుండెను. ఇక చెప్పనదేమి? పిచ్చెక్కినవానికి తేలుకుట్టినట్లు ఆతని యసూయ మిన్నందెను. సాయంత్రము ఇంటనుండుట మానెను. సుందరి భోజనానంతరము పాటబాడ జొచ్చెను. అందుల కాతడసహ్యించుకొనసాగెను. చివరకు "కులకాంతలకు సంగీత మేమిటికి? భోగముముండలవలె" అనుచు సణుగుకొనజొచ్చెను. దానితోడ విద్యాసుందరి సంగీతము కట్టుబడెను. క్రమముగ పురాణపఠనముగూడ లోపించెను. కాని యామె యొంటరిగ రామాయణపఠనమునం దొకింతకాలము గడుపజొచ్చెను.

వెంకట్రావునకు స్త్రీస్వాతంత్ర్యము గిట్టదు. స్త్రీ చదువంతకంటెను పనికిరాదు. ప్రతిదినమును తనగృహమున కనేకమంది వచ్చుచుండుట తనను మోసగించుటకే యని యాతని నమ్మకము. "ఈతనిభార్య విదుషి-సంగీత విద్వాంసురాలు" అనువాక్యము లాతని చెవిసోకిన కంపమెత్తుచుండెను.

సుందరరావు విద్యాసుందరికపుడపుడు యుత్తరములు వ్రాయుచుండెను. కొన్ని యుత్తరములు ప్రత్యేకము సుందరి పేరుననే వచ్చుచుండెను. ఒక్కొక్క యుత్తరము వచ్చినప్పుడు వేంకటరావు తలమీద తాటికాయ పడుచుండినటు లగుచుండెను. విపరీతమగు మనోబాధననుభవింపసాగెను. ఈ విషయమును విద్యాసుందరి గ్రహించుటెట్లు?

ఇట్లారుమాసములు గడచెను. భర్తమనోభావమునకు వ్యతిరేకముగ బ్రవర్తింపవలయునను తలంపు విద్యాసుందరి స్వప్నమందైనను తలంచి యెరుంగదు. అందువలన సంగీతసాహిత్యములను కట్టిపెట్టెను. రామాయణమును ప్రతిదినము పారాయణజేయుచు, సర్వవిషయముల వెంక

ట్రావునందు మిళితమై జీవిత చరితార్థత గాంచవలయునను మహోత్తరలక్ష్యమున కాలము గడుపజొచ్చెను.

వెంకట్రావు మధ్యాహ్నము, ఇంటనుండుట మానెను. క్రమముగ రాత్రులుగూడ ఊరి వెలుపల బంగళాయందు శయనింపజొచ్చెను. భార్యతోడ మాట్లాడకుండుటయే గాక, ఆమె కేసి మోమెత్తి చూడకుండెను. ద్వేషాసూయలు - అనుమానములతోడ పరితపింపుచు, అత్తమామల దిట్టుచు - భార్యను అసహ్యించుకొనుచు, సుందరరావును పెనుభూతముగ దలచుచు మనోవిశ్రాంతి నెరుంగక దినముల వెళ్లబుచ్చుచుండెను.

విద్యాసుందరి తన సంగీతసాహిత్యములు, రూపురేఖా విలాసములు, స్వీయజీవితమునకు బంధనములాయెనని తెలిసికొనెను. కాని యేమి చేయగలదు? భర్తను సుముఖునిగ నొనర్చుకొనుట కనేక విధముల బ్రయత్నించెను. విఫలప్రయత్నయ్యాయెను. భర్తను పలుకరించి చూచెను. తోటలోనికి దూడలగడ్డి నెపమున బోవుచుండెను. కాని వెంకటరావు పలుకరించినను ప్రత్యుత్తర మీయక యటనుండి నిర్గమింప జొచ్చెను.

ఇక విద్యాసుందరి మనోవ్యథను వర్ణించుటెట్లు? విద్యాసుందరి వెంకటరావును నిండు మనమున బ్రేమించి వివాహమాడెను. ఆతని యభిప్రాయానుసారము సంగీతమును వీడెను. వస్త్రాద్యలంకారములు తగ్గించి నిరంతరము గృహకార్యములయందు నిమగ్నయై కాలమును గడుపుచుండెను. కాని యామె హృదయము శాంతించుటెట్లు? ఆమెయందు లోపమేమి?

భర్త ప్రవర్తన చెడుచున్నదని వినుచున్నకొలదిని విద్యాసుందరి దిక్కుదోచక యేడ్చుచుండెను. రెండు పూటల వంటచేసి భర్త విస్తరియం దాహారపదార్థములు వడ్డింపుచుండెను. కాని యాతడు 'ఊ' 'ఆ' అని యనకున్నను భుజించిపోవుట యొకింత తృప్తిపడుచుండెను.

కాని చివరకు, తనచేతి భోజనమునుగూడ దినుట మానినప్పటినుండియు, విద్యాసుందరి దుఃఖము మిన్నుముట్టెను. కృశించి పోజొచ్చెను. మరియు నాభర్తను సన్మార్గవర్తనునిగ నొనర్చుమాయని భగవానుని బ్రార్థింప దొడగెను.

విద్యాసుందరి కాపురమునకువచ్చి మూడవ వత్సరము. కాని యామె తన మనోకష్టముల నెవ్వరికడను వెలువరింపలేదు. చూచుటకు తలిదండ్రులు వచ్చినప్పుడుగూడ తన దుఃఖమును తెలియనీయకుండెను. 'పుట్టింటికి పోయి రా' యని, వెంకట్రావు నుడువలేదు. విద్యాసుందరి యడుగలేదు. తలిదండ్రు లపుడప్పుడువచ్చి విషయమునంతయు గ్రహించిరి. ఏడ్చుటకంటె వారుచేయగల దేమున్నది!

∴ ∴ ∴

సుందరరావువచ్చి నెలదినములు దాటెను. కాని యొక్క దినమైనను విద్యాసుందరితోడ మాటలాడి యెరుంగడు. ఆమెయు మాటలాడుటకు బ్రయత్నింపలేదు. భుజించి వెంకటరావుతోడ బంగళాకు బోవుచుండెను. ఆతనితోడ తిరిగి భోజనమునకు వచ్చుచుండెను.

ఆతడు వచ్చుటకు కారణము వెంకట్రావు చర్యను గ్రహించుటకే. ఈ నెలదినములలోను సుందరరావు, వెంకటరావు గుట్టుమట్లు హృదయంగమమొనర్చుకొనెను. వెంకట్రావునకు పలువిధముల చెప్పిచూచెను, కాని లాభ మేమి? ఆతడు బిరబిగియుచుండెను. మరియు సుందరరావును త్వరితముగ సాగనంపుటకు యోచింపజొచ్చెను.

ఆదిన ముదయమున సుందరరావు నిదురలేచి యొంటరిగ బయలుదేరి గ్రామములోనికివచ్చి పెదతల్లిగారి పడమటింటి దొడ్డిలోని కరగెను. పనిపాటల నిర్వర్తించుకొని విద్యాసుందరి రామాయణమును పారాయణజేయుచుండెను. పెదతల్లి వంటయింటియం దుండెను. సుందరరావు విద్యాసుందరినిచూచి యిట్లనియె. సుందరీ! నా ప్రయాణము రేపుదయము. మామయ్యపేర వ్రాసినాను, జట్కాబండి రాత్రికివచ్చును.

విద్యా- అప్పుడేనా, ఏం కొంపమునుచుకు పోయిందీ, పరీక్ష ప్యాసయినావుగదా.

సుందరి- పనులున్నవి. బెంగుళూరుకుబోయి కొలది దినములుండి మద్రాసుకు బోవలె. వెంకట్రావు కావలసిన డబ్బు పంపుతానన్నాడు బియ్యేలు, చదవడానికి—

విద్యా- సరే—మంచిది. కాని అమ్మ చెప్పినమాట కేమి చెప్పావు! లక్ష్మిని పెండ్లాడు.

సు- పెండ్లి లేదు గిండ్లి లేదు. చేసుకున్నవాళ్లు చావుకు తింటున్నారు. ఇంక నేను—

విద్యాసుందరి తలవంచుకొనెను. కనులవెంట జొటజొట నీటిబిందువులు రాలుచుండ 'సరే—నీ యిష్టము. మేము క్షేమముగ నున్నామని అమ్మ నాయనలతో చెప్పు' (అనుచు తిరిగి రామాయణమును చేతధరించెను).

సుంద- నిన్ను వెంటబెట్టుకుని రమ్మనమని అత్తయ్య చెప్పినది. మీ నాన్న యుత్తరం వ్రాసాడు. నాతో బయల్దేరు.

విద్యా- ఎందుకు?

సుంద-ఏమో! నాకు తెలియదు.

విద్యా-అమ్మ నానల చూచి సంవత్సరము దాటినది. ఇక్కడ కాలుబెట్టినతర్వాత పిల్లలను చూడలేదు. కండ్లు పోయినట్లున్నది (అని తలవంచుకొని రామాయణమును) చూడజొచ్చెను.

సుంద- సరే, తెల్లవారుగట్ల ప్రయాణము సిద్ధముగా వెంకట్రావుతో చెప్పాను. తిరిగి సాయంత్రం చెబుతా.

విద్యా- ఆయనవచ్చునా?

సుంద- నేను రమ్మనమనలేదు. అయినా, వాడే మొఖం బెట్టుకుని అత్తయ్యా, మామయ్యలను చూస్తాడు.

విద్యా- ఎందుకడగలేదు.

సుంద- ఏమిటో గండురం-అతిచిరాకు-అడిగినమాటకు సరిగ జవాబుచెప్పదు, నేనడుగవలసిన మాటలన్నీ అడిగాను. మౌనము. జవాబుచెప్పడు. నీవుబయల్దేరు. పైన భగవంతుడున్నాడు.

విద్యా- చస్తేమేమిద్దరము. అంతేగాని నొక్కతెనురాను. ఆత్మహత్య మహాపాపము అదేఅడ్డు. కాని ఒకతెను బయల్దేరితే తెరువుదగ్గర దిగుడుభావికి-అంతేకాని మరియొకచోటికిరాను - నమ్ము.

అనుచు విద్యాసుందరి చివ్వన లేచెను. కన్నీరుప్రవహింపుచుండ వంటయింటిలోనికి బోజొచ్చెను. సుందరరావు హృదయముకరిగి నీరాయెను. ఉత్తరీయమున కండ్లు తుడుచుకొనుచు ఇట్లనియె: విద్యా! నామాటవిని బయల్దేరు.

విద్యా- నూరుచెప్పు. వెయ్యిచెప్పు. నేనొంటరిగరాను. నిశ్చయము. ముమ్మాటికి అంతే.

సుంద- ఒక్కమాటవిను చెప్పుతా.

విద్యా- వినటములేదు. కనటమూలేదు. చెవులుమూసికొన్నానా చేసుకున్నది యనుభవింపకతప్పదు. ఏమహాపురుషులు ఏసతీమతల్లులు తప్పించుకోగలిగిరి?

సుంద- ఈవెర్రివేదాంతాలకేంగాని, నేనుచెప్పినట్లుచేస్తావా, చివరయత్నము.

విద్యా- ఏమిటిచేసేది ఏచెర్లోనో, భావిలోనో దిగడమే.

సుంద- కాదు నేనుచెప్పినట్లుచెయ్యి; నామాటవిను.

విద్యా- నీమాటలేదు నామాటలేదు. న్యాయమని తోచి, ఆయనచెపితే— అంతేగాని బ్రహ్మచెపితేవినను—చేయను.

సుం- సరే ఇంక నేనేమిచెప్పేది నీయిష్టము. నీవు బాగుగ చదువుకొన్నదానవు. ఆరుపాళ్లు మానవయత్నము. ఏడోపాలు దైవసహాయము. నీకుతెలియదా!

విద్యా- తెలియకేమి! తెలిసినా చేసేదిలేదు, నాప్రయత్నాలు, తెలివితేటలు, అన్నీపూర్తియైనవి. ఇంతకు ఆడదానిబ్రతుకు 'అర్థాన్నం, చెతుర్మధ్యం' కాలు కదిపితినా ముప్పు, ఇహపరముల అమ్మనానలకపకీర్తి.

సుంద- నాకామాటలు తెలుసు. నెలరోజులనుండి ఇక్కడవున్నదెందుకు? ఇదిమంచిసమయము. నేనుచెప్పినట్లుచెయ్యి. నీయిష్టదైవమగు శ్రీరామచంద్రమూర్తి యున్నాడు. నీతి విరుద్ధమగుయోచనల జెప్పువాడను గానని నీవెరుగుదువుగదా! నమ్ము నామాటనమ్ము.

విద్యా- తెలియకేమి! అందువలననే, నీతోమాట్లాడుట. కాని నీవుచెప్పినట్లు చేస్తానని నమ్మక.

సుంద- నీవిద్యాబుద్ధులు నీతినియమాలు చిన్నప్పటినుండియు నాకుతెలుసు. నేను స్త్రీజనోద్ధరణసంఘమందు జేరితిని. నీవంటియుత్తమరాండ్ర ఇక్కట్లు దొలగుటకు తోడ్పడకలిగినయెడల, జీవితచరితార్థముగ భావింతును. వచ్చిన నాల్గవదినముననే పోదలచితిని. కాళ్లాడలేదు. నెలదినములనుండి యున్నదిందుకే. నామాటనమ్ము. నేనుచెప్పినట్లుచెయ్యి నీకష్టములుదొలగును. మీరిర్వురు కలిసిమెలసియున్న మీకడ మరియొక నెలదినములుండి వీణాగానముగ్రోలి, సుందరకాండము నీవు చదువుచుండపినవలయుననియున్నది. భగవానుడు నాయీప్సితమును నెరవేర్పడా! (కన్నీరు దుడుచుకొనును) నన్ను నీసోదరునిగ భావించు; ఏకగర్భజనితునిగ తలంచు. నీకష్టములు నావి; మరుమాటాడక. నేనుచెప్పినట్లుచెయ్యి. నేను నీ కన్నను నీవు నాకు చెలియవు. (విద్యాసుందరి యావురుమని యేడ్చుచుండ కన్నీరు ప్రవహింపజొచ్చెను) ఇప్పటినుండియు నీవునన్ను అన్నాయని, పిలుచుచుండుము. ఆతడు నాకు అన్న, నీవు చెలియలువు.

విద్యా- సరే చెప్పు.

సుంద- రాత్రి మేముభోజనముచేయునప్పుడు నీవుగదిలో యుండు. ఆవేళకు నాకుబండివచ్చును. 'నేనుగుంటూరుపోతాను.' అనిచెప్పు అంతే చాలు. సావిట్లో యుంటాను నేను.

విద్యా- ఎందుకు అట్లనుట. న్యాయమా! నిజముగా రాదలచిన చెప్పవచ్చు. యూరక యనుట కలవరబెట్టుట కాదా!

సుం-కలవరంలేదు, గిలవరంలేదు, అన్నితేల్తవి. నీయమాయకత్వమే నిన్నీస్థితికితెచ్చింది. వాడునిలువెల్లవుట్రమనిషి... నేనుచెప్పినట్లుచెయ్యి, మీసంసారము కుదుటబడుతుంది. నేను సంతోషముగ వెళ్తాను, అమ్మనానల మనోబాధ తీరుతుంది. (ఇంకాశేషము)